ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రేపు జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ నగరం సర్వ సన్నద్ధమైంది.
- అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.
- ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయని భారత ఎన్నికల సంఘం ఉప సంచాలకులు పి.పవన్ వ్యాఖ్యానించారు.
- ఈరోజు విడుదలైన ఎడ్‌సెట్ ఫలితాలలో 99.42 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని మంత్రి నారా లోకేష్ తెలిపారు.

=======================

విశాఖ సాగరతీరంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఈరోజు పరిశీలించారు. ప్రధాన వేదిక, కంపార్ట్‌మెంట్‌లు, ఎల్ఇడి స్క్రీన్, సౌండ్ సిస్టం మొదలైన వాటిని ఆయన పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షా, 50 వేల ప్రదేశాల్లో రేపు యోగా ప్రదర్శనల కోసం ఏర్పాటు చేశామని యోగాంధ్ర నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు చెప్పారు.

కాగా.. విశాఖ సాగర తీరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఆర్.కే.బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం నుండి భీమునిపట్టణం వరకు మొత్తం 26 కిలోమీటర్ల మేర యోగాభ్యాస ప్రదర్శన నిర్వహించనున్నారు. దీని కోసం మొత్తం 326 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌కు గెజిటెడ్ స్థాయి అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్రతీ కంపార్ట్‌మెంట్ లో యోగా శిక్షకులు, ముగ్గురు ప్రదర్శకులు, 10 మంది వాలంటీర్లు, ఒక ఏఎన్ఎం, ఆశా వర్కర్, పోలీసు అధికారి, గిన్నీస్ రికార్డు నమోదు కోసం కంపార్ట్‌మెంట్‌కు 10 మంది చొప్పున మొత్తం 4 వేల 600 మంది ప్రతినిధులు తదితరులు ఉంటారు. యోగా ప్రదర్శకులు 1,438 మంది, శిక్షకులు 907 మంది ఈ కంపార్ట్‌మెంట్లలో సిద్ధంగా ఉంటారు. పర్యవేక్షణకు డిప్యూటీ కలెక్టర్లతో పాటు, అఖిల భారత అధికారులు సైతం బాధ్యత తీసుకున్నారు.

========================

రేపు జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈరోజు ఆమె విశాఖలో మాట్లాడుతూ.. యోగా దినోత్సవ కార్యక్రమాల్లో విశాఖలో 5 లక్షల మంది, రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొంటున్నారని తెలిపారు. యోగా దినోత్సవాలకు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్టం భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నగరంలో ఉన్న 2 వేల 350 సీసీ కెమేరాలతో పాటు అదనంగా 12 వందల సీసీ కెమేరాలు, 50 డ్రోన్లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అర్ధరాత్రి 2 గంటల నుండి యోగాలో పాల్గొనేవారు వివిధ కేంద్రాలకు రావడం జరుగుతుందని, విద్యార్థులు ఇంటి నుండి బయలుదేరినప్పటి నుండి తిరిగి ఇంటికి చేరేవరకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేశామని హోం మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

========================

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయని భారత ఎన్నికల సంఘం ఉప సంచాలకులు పి.పవన్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ప్రతినిధులతో ఈరోజు ముఖాముఖి చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడంలో మీడియా పాత్ర ప్రముఖమైనదని పేర్కొన్నారు. ప్రాంతీయ స్థాయిలో భారత ఎన్నికల సంఘం కమ్యునికేషన్ ప్రభావాన్ని, పరిధిని పెంచడం ద్వారా ఓటర్లను చైతన్య పర్చడంలో ప్రాంతీయ మీడియా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

========================

అసాంఘిక శక్తుల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. ఎవరైనా చట్టాలని గౌరవించాల్సిందేనని, నియమ నిబంధనలను పాటించాల్సిందేనన్నారు. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించే అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసిందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిని కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, అలాంటివారిపై రౌడీ షీట్లు తెరిచి.. అణచివేస్తామని హెచ్చరించారు.

విరామం

========================

ఆంధ్రప్రదేశ్ ఎడ్‌సెట్ ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఫలితాలను 'ఎక్స్' వేదికగా విడుదల చేశారు. ఈ పరీక్షల్లో 99.42 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల 795 మంది రిజిస్టర్ చేసుకోగా.. 14 వేల 527 మంది అర్హత సాధించారని వెల్లడించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన ఎడ్‌సెట్ పరీక్ష జరిగింది. ఇటీవల ప్రాథమిక కీ విడుదల చేసిన అధికారులు.. తాజాగా ఫలితాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. కాగా... అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, ఎడ్‌సెడ్ హాల్ టికెట్‌తో పాటుగా పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి ఫలితాలు, ర్యాంక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

========================

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 25 వేల మంది పాఠశాల విద్యార్థులు 108 సూర్యనమస్కారాలు చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన విద్యార్థులతో చేపట్టిన ఈ బృహత్తార కార్యక్రమానికి కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అలాగే విశిష్ట అతిధిగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. యోగా

గురువు పతంజలి శ్రీనివాస్.. విద్యార్థులతో 108 సూర్య నమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. యోగ సాధనతో మనలో క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. 25 వేల మంది విద్యార్థులతో సూర్య నమస్కారాల కార్యక్రమం చేపట్టామని మంత్రి లోకేష్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

=======================

రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈరోజు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు సీసీఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మీ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రెవెన్యూ వ్యవస్థ ద్వారా 99 శాతానికి పైగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులు ఆర్టిఫీషియల్ ఇంటిల్‌జెన్స్, అన్‌లైన్, చాట్ జిపిటి, వంటి టెక్నాలజీ లను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================
=======================